

# కాలమ్ దాటని కబుర్లు

బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకీ కొన్ని కులాసా కబుర్లు

### హృదయం ఎక్కడున్నదీ?

**సైన్స్ టీచర్ బోర్డ్ మీద** శరీర భాగాలు వేసేటప్పుడు హృదయం ఎక్కడుందో చెప్పలేదు. గుండె వేరూ హృదయం వేరూ అని సావిత్రీ, ఏ.ఎన్.ఆర్ సినిమాలు చూసి అనుకునేదాన్ని. కవులకి ముడి సరుకు హృదయం.

"నా హృదయంలో నిదురించే చెలీ" నుండి "హృదయం ఎక్కడున్నదీ?" వరకూ అది మన కళ్ళకి కనిపించని శరీర భాగం. అది నేను ఒక్కదాన్నే అనుకునేదాన్ని. కానీ కవికి కూడా తెలియదు అని ఆ పాట విన్నాక అర్థమైంది.

రెండు చేతుల వేళ్ళూ కలుపుతూ, ఓ గోపురంలా చూపెడ్తూ, అది "మనసు" అని అర్థం చెప్పడానికి 40 ఏళ్ళు పడితే, బొటనవేలూ, చూపుడు వేలూ కలిపి, చిటికేసినట్లు పెట్టి, జాపనీస్ హార్ట్' సైగ చెయ్యడానికి 60 యేళ్ళు పట్టింది.

"మనసు గతి ఇంతే... మనసున్న మనిషికీ సుఖం లేదంతే" అంటే మా అమ్మని "అందరికీ వుంటుందా ఈ మనసు?" అని అడిగాను.

"ఉంటుంది" అంది.

"మరి నెప్పిగా వుంటే డాక్టర్ టేబ్లెట్ ఇవ్వడా?" అని అడిగాను.

అమ్మ పకపకా నవ్వింది కానీ జవాబు చెప్పలేదు. ఓ వయసు వచ్చాక కళ్ళకి కనిపించని ఆ 'మనసు గోల' నాకూ అర్థమైంది.

'మనశ్శాంతి', మనో దుర్బలత్వం 'మనోచంచాంచల్యం' ఇలాంటి వాటికి మెడికల్ డాక్టర్స్ దగ్గర మందులు దొరకవు అని అర్థమైంది.

మెడికల్ షాప్‌కి వెళ్ళి 'నా మనసు బాలేదు ఏదైనా మందు' ఇవ్వమంటే, ఎదురుగా వున్న వైన్ షాప్ చూపెడ్తాడు.

"మరిచిపోమన్నావు.. అందుకే తాగుతున్నాను" అన్న డైలాగ్స్ విని, ఆ మందు వేసుకుంటే మేత్స్ టీచర్‌నీ, ఆల్‌జీబ్రా లెక్కల్నీ మరిచిపోవచ్చేమో అనుకునేదాన్ని.

"గుండె వేరూ మనసు వేరూనా?" అని నా ఫ్రెండ్స్‌తో చిన్నప్పుడు డిస్కషన్ పెట్టాను. సందానీగాడు మధ్యలో కొచ్చి, "ఆ శీనూ వాళ్ళ బామ్మకి వుందే అదీ గుండు" అని అతి తెలివి ప్రదర్శించాడు. "గుండు కాదురా 'గుండె' అని వాడికి మొట్టికాయ వేసి చెప్పాను.

భవాని నిట్టూర్చి "మనసు వున్న వాళ్ళకి బోలెడు బాధలుట. మా అక్క అంటూంటే విన్నాను" అంది.

"అంటే? అడిగాను.

"మనసు వుంటే ప్రేమిస్తారు" అంది.

"లేకపోతే?" అడిగాను.

"పెళ్ళి చేసుకుంటారు" అంది.

నాకు కొంత అర్థమైంది. మంజూ వాళ్ళక్కకి పెళ్ళి కుదిరిందని చెపితే, దాన్ని అడిగాను "మీ అక్కకి మనసులేదా? మరి పెళ్ళి చేసుకుంటోంది" అని.

అది అర్థంకాక "మా అమ్మని అడిగి చెప్తా" అంది.

మర్నాడు అమ్మమ్మ నా చెవి నులిమి ప్రైవేటు చెప్పింది. "పెద్ద మాటలూ నువ్వూ.. మనసూ, ప్రేమా అని మాట్లాడుతున్నావుటా? ఆ మంజూ వాళ్లమ్మ చెప్పింది?" అని.

పెద్ద వాళ్లకి ఈ 'మనసు' అన్న మాట అంటే పడదు అని నాకు అర్థమైంది.

ఆ తరవాత ఓ పన్నెండేళ్ళు గడిచాక నాకూ 'మనసుంది' అని కమల్‌హాసన్‌ని మరో చరిత్రలో చూసాక అర్థమైంది.

భవానితో అంటే అది "నాకూనూ" అంది.

అలా చాలామంది టెంత్ పాసయి ఇంటర్మీడియెట్‌లోకి వచ్చిన అమ్మాయిలకి హార్ట్ బీట్ పెరిగినట్లు చేసిన హీరో కమల్‌హాసన్ అప్పట్లో.

మరో చరిత్రలో హీరోహీరోయిన్లు పడిన నరకం అంతా చూసి, 'మనసు' వుండడం వల్లనే. పైగా ఆ హృదయం, లేదా మనసు బాధకి మందు కని పెట్టబడలేదని అర్థమైంది.

నిజానికి 'హృదయం' అనే విషయాన్ని ఏ ప్రబంధ కవులో కనిపెట్టకపోతే ఇన్ని పుస్తకాలూ, ఇన్ని సినిమాలూ, అవీ ఎలా వచ్చేవి? కావ్యాలూ, కవితలూ, నవలలూ ఎలా వుండేవి? కానీ ప్రతి తల్లి తండ్రులూ తమ పిల్లలకి ఏదో రాకూడని జబ్బు వచ్చినట్లుగా బాధపడిపోతారు వయసొచ్చి వాళ్ళు ప్రేమించగానే.

"మా ఇంటా వంటా లేవు ఈ ప్రేమలు.. బుద్దిగా పెళ్ళి చేసుకో" అంటారు.

అంటే పెళ్ళి చేసుకున్న వాళ్ళు ప్రేమించకూడదని. నాగయ్యగార్లూ గుమ్మడిలూ ఎందుకు అర్థం చేసుకోరు ప్రేమించాం అంటే? వీళ్ళూ ఆ వయసులోనుండేగా వచ్చారు అనుకునేదాన్ని. అసలు నేనైతే నాగయ్యగారినీ, గుమ్మడి గారినీ పోకిరీ

కుర్రాళ్ళలా అస్సలు ఊహించలేను. వాళ్ళు హీరోలుగా వేసిన వాటిలో కూడా పెద్దగా, హుందగా, సంగీతం పాడుతూనే కనిపించేవారు. 'స్వర్గసీమ'లో లాగా.

తర్వాత అమ్మా నాన్నలకి కూడా మనసుండేదనీ వాళ్ళ యవ్వనంలో ప్రేమించుకున్నారనీ కొన్ని సినిమాలు వచ్చాక అర్థమైంది.

'ఆలం అరా' నుండి ఇప్పటిదాకా సినిమా మానవాళికి ఎంత విజ్ఞానాన్ని అందించిందో కదా! లేకపోతే ప్రబంధాలూ, కావ్యాలూ చదువుకున్న వాళ్ళకి మాత్రమే ఈ 'మనసు' గురించీ, ప్రేమ గురించి అర్థమయ్యేది.

"అమ్మమ్మా నా మనసులో నెప్పిగా వుంది, ఈ రోజు స్కూల్‌కి వెళ్ళను" అంటే అమ్మమ్మ పిక్కపాశం పెట్టేది.

అదే "నా గుండెలో నొప్పి వస్తోంది" అంటే గాభరా పడిపోయి బాలకృష్ణ డాక్టర్‌గారి ఆస్పత్రికి రిక్షా కట్టించి తీసుకు వెళ్ళేది.

అందువల్ల 'గుండె వేరూ! మనసు వేరూ' ఈ మనసు రచయితలకి తప్ప డాక్టర్లకీ, టీచర్లకీ కనపడదు అని మా ఫ్రెండ్స్‌తో మీటింగ్‌లో చెప్పాను.

సందానీ గాడు "నేను పెద్దయితే మనసు డాక్టర్ అవుతా" అన్నాడు.

"మూడో ఎక్కం రాదు కానీ డాక్టర్ అవుతావా?" అంది మంజు.

"మనసు డాక్టర్ అవనీకి సదువు అక్కర్లేదు, శోభన్ బాబు అయితే సాలు!" అన్నాడు.

"మనసు బాగోలేదే అక్కా" అని మా పిన్ని, మా అమ్మతో అంటుంటే, నేను చాటుగా విని, ఎదురుగా వెళ్ళి "నీకు పెళ్ళయింది మనసు వుండకూడదు" అని చెప్పేసి అమ్మతో దెబ్బలు తిన్నాను.

"మనసు" గురించి కవులూ, రచయితలూ చాలా రీసెర్చ్ చేసారు కానీ ఎవరికీ ఈ శాఖలో డాక్టరేట్ ఇవ్వలేదు.

"మనసుని ముల్లుతో పొడిచినట్లుంది" అని నవలల్లో రాస్తే, బహుశా అది ఫిజికల్ పెయిన్ అయివుంటుంది అనుకున్నాను.

దేవదాసు నుండీ అర్జున్ రెడ్డి వరకూ 'ఈ మనసునీ, ప్రేమనీ' కనిపెట్టడానికి చాలా రీసెర్చ్ జరిగింది.

"చుట్‌కే సే సింధూర్" టైప్‌లో బొటనవేలూ, చిటికెన వేలూ కలిపి "గుండె" అంటే "ఆఠీన్" షేప్ లో చూపెట్టడానికి షష్టిపూర్తి వయసొచ్చింది సినిమాకి.

ఇప్పుడు 'హృదయం ఎక్కడున్నదీ?' అని ఈ కాలం పిల్లల్ని అడగక్కరలేదు. వాళ్ళకి తెలుసు. హృదయం, మనసూ అన్నీ ఎక్కడుంటాయో.. వాటిని ఎదుటివారికి అర్థమయ్యేట్లు ఎలా చెప్పాలో వాళ్ళకి బాగా తెలుసు.

"హృద్రోగ నిపుణులు" అన్న మాట మాత్రం చిన్నప్పుడు చాలా కన్‌ఫ్యూజ్ చేసింది మా తరాన్ని.

"హృద్రోగ నిపుణులు దగ్గరకి వెళ్ళి "నేనొక అమ్మాయిని ప్రేమించాను, నా హృదయంలో చాలా బాధగా వుంది" అంటే ఆయన తెల్లబోతాడే కానీ మందు ఇవ్వగలడా? అప్పుడు మెడికల్ షాప్ అతను చూపించిన బోర్డ్ దగ్గరకి వెళ్ళి "తాగితే మరిచిపోగలను, మరిచిపోతే బ్రతకలేను" అని చెపితే, విత్ అవుట్ ప్రిస్క్రిప్షన్ 'డబల్ మాల్ట్ విస్కీ' ఇచ్చి పంపగలడు.

ఇంతకీ గుండె వేరూ హృదయం వేరూ. మనసు వేరూనా? ఎవరికి తెలుస్తుందీ? అంతా తెలిసినట్టే అనిపిస్తుంది కానీ క్లియర్‌గా చెప్పలేం, అదేమిటో.

Post your comments







